"ఏం వసంతా! కాలేజీనుండి అప్పుడే వచ్చేస్తున్నావు?" కిర్రుమంటూ గేటు చప్పుడు చేసుకుంటూ తమ పోర్షన్‌వైపు వెళ్లిపోతున్న వసంతకేసి చూస్తూ అడిగేడు ప్రసాదు.

ఏదో ఆలోచనలో పరధ్యానంగా వెళ్ళబోతున్న వసంత అప్పటిగ్గాని ప్రసాదుని చూసింది కాదు. వరండాలో వాలు కుర్చీలో కూర్చుని ఓ అట్ట వళ్ళో పెట్టుకుని పరీక్ష పేపర్లు దిద్దుతున్నాడు.

వాటిని చూస్తూ, "అంటే మీరు మధ్యాహ్నం స్కూలుకు వెళ్ళలేదా మేస్టారూ?" అతనడిగిందానికి జవాబు చెప్పకుండా తిరిగి అడిగింది



వసంత ప్రసాద్‌ని.

"అబ్బే....వంట్లో చికాగ్గా ఉంటే మధ్యాహ్నం సి.యల్. పెట్టేసి వచ్చే సేను...." అన్నాడు ప్రసాదు.

అంతవరకూ రెండు పోర్షనుల దారులు కలిసే చోట నిలుచుండి పోయిన వసంత అది విని గబగబ ప్రసాదు వైపు నడిచి వచ్చింది.

"ప్రొద్దున్న బాగానే ఉన్నారే.... అంతలో ఏమైంది? మరి వంట్లో బాగాలేకపోతె ఈ పేపర్లన్నీ దిద్దడం ఎందుకు మేస్టారూ.... రెస్టు తీసుకోక...." గబగబా అడుగుతున్న మాటలలో ఆదుర్దా వ్యక్తమయింది.

"అలా బుద్ధి చెప్పు వసంతా.... ఎప్పుడూ నా బొందో అంటూ ఆ స్కూలు పనులే చేసుకోకపోతే నాలుగు ప్రయివేట్లు చెప్పుకుంటే



కాదూ....” గ్లాసులోని బార్లీని స్పూనుతో టంగ్ టంగ్‌మని కలుపుతూ వచ్చి ప్రసాదు కందించింది కమల. “వస్తానూ....” అంటూ వెళ్లిపోయింది వసంత.

“వసంత....ఏమిటో ఈ మధ్య చాలా సీరియస్‌గానూ, పరధ్యానంగానూ ఉంటోందండీ....” అంది కమల వసంత వెళ్లిపోయిన వైపు చూస్తూ. “పెళ్లిమీదకు ధ్యాస మళ్లిందో ఏమో....” నవ్వింది తానేదో కనిపెట్టేసినట్టు.

“ఇప్పటికి నీకు తలకెక్కిందన్న మాట...అయితే ఈ లెక్కన మరో ఏడాదిగ్గానీ వాళ్ళమ్మగారికి అర్థం కాదు....” అన్నాడు ప్రసాదు వేళాకోళంగా. అప్పటికే మూతిముడుచుకొన్న కమలను చూస్తూ -“వసంత చాలా ఆలోచనగల పిల్ల. ప్రాక్టికల్ మనిషి కూడానూ. నా ఉద్దేశ్యంలో ఆ అమ్మాయి తన పెళ్లి గురించీ, తన భావి జీవితం గురించి కనీసం రెండు మూడేళ్ళుగా తీవ్రంగా ఆలోచిస్తూ ఉండి ఉండాలి” అన్నాడు.

ప్రసాదు మాటలకు ఎక్కడలేని కుతూహలం కలిగింది కమలకు.

“అయితే ఉండండి. సాయంకాలం తీరిగ్గా ఉన్నప్పుడు నేనే అడిగేస్తాను....” అంది కమల ఆలోచన లేని ఉత్సాహంతో.

“అలాంటి బుద్ధిలేని పన్లు చెయ్యకు” అంటూ పేపర్లు కట్టకట్టేసి లేచేడు ప్రసాదు.

సాయంకాలం అలా బజార్లోకి వెళ్లి రావడం ప్రసాదు కలవాటు. అప్పటికి వంటింటి పనులు పూర్తి చేసుకొని వరండాలోకి వస్తుంది కమల. వసంతగానీ, వాళ్ళమ్మగానీ, ఎదురింటి వాళ్ళుగాని వచ్చి ఒక్కోసారి కూర్చుంటూ వుంటారు.

“మేస్టారు బజార్లోకి వెళ్లిపోయేరేమిటి కమలా?” అంది వసంత ఆ సాయంత్రం.

“ఆఁ! అవునుగానీ, ఏమిటి ఈ వేళ కాలేజీనుండి వస్తూ ముఖం వాడిపోయి వుంది....?” అనడిగింది కమల, ప్రసాదు వార్నింగు ప్రసాదుకే వదిలేసి.

“ఏం వుంటుంది కమలా! కాలేజీలో చదివే అమ్మాయిలకి వుండే బాధే. కాలేజీ కుర్రాళ్ళ అల్లరులూ, వేషాలూ....”

“ఏం?ఎవరైనా అమ్మాయిగారివెంట పడ్డారేమిటి?” అనడిగింది కమల కుతూహలంగా.

“వెంటపడడమూ జరిగింది .... పరిచయం పెంచుకుని వాళ్ళ మనస్తత్వాలు పరిశీలించడమూ జరిగింది.” కమల అమాయకంగానూ, కుతూ

ప్రేమ కథలకు ఎవరూ ఫుల్‌స్టాప్ పెట్టలేదు. యింకా-కామాలతో, సెమీకోలన్‌లతో నడుస్తున్నాయి ట్రయాంగిల్ ప్రేమ కథల త్యాగాలతో కన్నీళ్ళతో తడిసిపోతున్న కథా, నవలా సాహిత్యంలో వాస్తవికత ఎంత అన్న ప్రశ్నకు సమాధానం ఈ కాకమ్మ....

హాలంగానూ వసంత ముఖంలోకి చూసింది.

కమలను చూస్తూంటే కాస్త ఆట పట్టించాలనే వుంది వసంతకి. కాని తన సమస్య కమలతో ముడిపడి వుందన్న విషయం గుర్తురాగానే ఆమె అమాయకత్వానికి జాలేసింది.

"ప్రేమా- గీమా.డూ్యయెట్టూ డయిలాగూ జాంతానై ...రెండు మూడు ప్రశ్నలు సూటిగా అడగడమేమిటి, తోక ముడిచెయ్యడం కనిపించింది. ఇప్పటి వాళ్ళకి సులువుగా డబ్బు సంపాదించెయ్యాలనేగాని జీవితం పట్ల ఓ బాధ్యత ఎవ్వరిలోనూ కనిపించడంలేదు కమలా ... తరాలు గడుస్తున్నాయి. చదువులు పెరుగుతున్నాయి. నాగరికత ముందడుగు వేస్తోంది. కాని కట్నాలూ, లాంఛనాలూ, సాంప్రదాయాల విషయాలకి వచ్చేసరికి ఉపన్యాసాలు స్టేజికి కట్టుబడిపోతున్నాయి. వీళ్ళనిచూస్తుంటే యువతరం ముసుగేసుకున్న ముసలాళ్ళు అన్పిస్తోంది నాకు."

ఏవేవిటో చెపుతూన్న వసంతకేసి ఆశ్చర్యంగా చూడ్డం తప్పించి ఏమీ అనలేక పోయింది కమల. ప్రసాదు అన్నట్టు వసంత చాలా ప్రాక్టికల్‌గా ఆలోచిస్తున్నదనిపిస్తోంది.

"ఏమిటి తీరుబడిగా మాట్లాడుకుంటున్నారు?" అంటూ వచ్చి కూరగాయల సంచీ అందించేడు ప్రసాదు.

"అబ్బే ఏమీలేదు మేస్టారూ..." అంటూ ప్రసాదు కళ్ళలోకి ఓసారి చూసి, "వంట్లో బాగులేదంటూ ఇప్పుడంత అర్జంటుగా కూరగాయలు తీసుకు రాకపోతే ఏం మేస్టారూ..." అంది అభిమానంగా వసంత.

"నీకేం? నువ్వలానే చెప్తావు ... ఓ పూట నేను తీసుకురాకపోతే మా కమల గడ్డిపెడుతుంది..." అన్నాడు నవ్వుతూ.

అప్పటికే బుంగమూతి పెట్టేసుకుందికమల. "హాస్యాని కన్నారు లెద్దూ..." అని, "మరింక నోట్సు రాసుకోవాలి..వెళ్తాను..." అంటూ

ఇద్దరివంకా చూస్తూ వెళ్ళి పోయింది వసంత.

మర్నాడు ప్రసాదు స్కూలుకు వెళ్ళిపోయిన తర్వాత, తీరిగ్గా కూర్చుని ఉబుసుపోక వోనవల పట్టుకుంది కమల. "ఏమిటీ చదువుతున్నావు?" అంటూ వచ్చింది వసంత.

"అదేమిటి! కాలేజీకి నాగా పెట్టేశా వేంటి?"

"ప్చ్..,పోనీలెద్దూ..కాలేజీలో చదువులు జీవితాన్ని చదువుకుని తీర్చి దిద్దుకోవడానికేగదా! నే నిప్పుడా ప్రయత్నంలోనే వున్నాను. అందుకనే చదువుమీదంతగా శ్రద్ధలేదు."

"నీదంతా తిరకాసే వసంతా,... ఏదీ సరిగ్గా చెప్పవు. అసలే మావారన్నట్టు నేను మొద్దు రాచ్చిప్పను..." అంది కమల.

కాసేపునసిగింది వసంత...తర్వాత, "ఏం లేదు, నా పెళ్ళి గురించి,.." అంది నెమ్మదిగా. వెంటనే చేతిలోని నవల గిరాటేసేంది కమల. "ఏమిటే మిటీ...నీ పెళ్ళే .. మరి మీ అమ్మగారు చెప్పలేదే..."

"అబ్బా ... కమలా ... పూర్తిగా వినవూ..." అంటూ సుతారంగా నెత్తిమీద కొట్టుకుంది వసంత.

"మా అమ్మగారికీ విషయం తెలియదు" అంది మళ్ళీ.

"ఏమిటీ... అయితే నువ్వే ఎంచుకున్నావన్న మాట ... భలే-భలే. మంచి పనిచేసేవు" అంది సరదాగా.

"అవును. నిన్న నేను చెప్పేనుగుర్తుందికదా... చాలామంది అబ్బాయిల్ని పరిశీలించేన్ని. కాని వీళ్ళలో నాకు కనిపించింది—ఫేషన్‌లు, దుస్తులూ, డాబూ-వీటిని ప్రసాదించే డబ్బూ, వీటిమీద విపరీతమైన మోజు మాత్రమే. కాని ఏ ఒక్కడిపట్లా ఆడదాన్ని గౌరవించాలీ, సుఖపెట్టాలీ, స్వయం కృషితో - అంటే అమ్మా, నాన్నల పేరు చెప్పుకోకుండా పైకి వచ్చి, జీవితం జీవించడంకోసమన్నట్టుగా బాధ్యత ఎరిగిన మనిషి ఒక్కరు తప్పించి నాకు ఎవ్వరూ కనిపించలేదు."

"హమ్మయ్య..,నీ ఉపన్యాసమంతా నాకేం బోధపడలేదుగాని, ఒక్కరిని ఎంచుకున్నావన్న మాట.."

"నీ సహకారం వుంటే ఆ ఒక్కరినీ సాధించుకుంటాను."

"ఏవిటి వసంతా ... ఇరుగూ పొరుగన్న తర్వాత ఆ పాటి సాయాలు చేసుకోమా?ఏమిటి? చెప్పు.." అంది కమల ప్రోత్సహిస్తూ.

"మేస్టారు."

"ఆఁ."

"అవును కమలా! నీకు బాధగానే ఉండొచ్చు... కాని ఇదినిజం. నువ్వు నన్ను అర్థం చేసుకుని నా కల పండించు...నీకు అడ్డొస్తున్నా నను కోకు...నీ అర్ధ భాగంలో నాకో సగం పంచి ఇవ్వు..."

కమల ముఖమంతా క్షణంలో ఎర్ర బారి పోయింది. మరో క్షణంలో సెగలు కక్కడం చూసి ఆగి పోయింది వసంత.

"నీకున్న చదువు లేకపోవచ్చు..కాని నా భర్తని నేను వదులుకునేంత పిచ్చిదాన్ని కాదు. అయినా ఈ విషయం ఇంత ధైర్యంగా అడగ టానికి నీకు ముఖమెలా చెల్లింది?" అంటూ కోపంతో మరి మాట రాలేదు కమలకి.

"స్టాప్...స్టాప్..." అంటూ పగల బడి నవ్వసాగింది వసంత.

"నేనంత నవ్వులాటగా ఉ...న్నా... నా..." అంటూ కోపం, దుఃఖం మిళితమైపోయి ఎర్రబడిన కళ్ళు నీళ్ళతో నిండిపోయేయి కమలకి.

"ఛ...ఏమిటి కమలా ఇది. అసలు సంగతి విను. మొన్న మధ్యాహ్నం కాలేజీ లైబ్రరీలో కూర్చుని ఓ రచయిత్రి నవల చదివేం నేనూ, నా ఫ్రెండ్సూ. అందులో హీరోయిన్ మరో సైడ్ హీరోయిన్ ఇద్దరూ ఒకరికి తెలియకుండా ఒకరు ఒకే హీరోని పెళ్లి చేసుకుంటారు. తెలిసేక ఇద్దరూ ఆ హీరోకి నువ్వు తగినదానివంటే నువ్వు తగిన దాని వని త్యాగాలు చేసేసుకుని ప్రాణాలు తీసుకుంటారు. దీనిమీద మేమంతా డిస్కస్ చేసుకున్నాం. అది గొప్ప ప్రేమ నవల అనీ చారిత్రాత్మకంగా నిలుస్తుందనీ కొందరన్నారు. అవాస్తవికమనీ, ఇద్దరు పెళ్ళాలు ఉంటే కొంప మునిగిందేవిటని కొందరు వాదించేరు. అసలు ఆ రచయిత్రికి స్త్రీ మనస్తత్వం తెలుసునా అని అనుమానం వచ్చి అదే ఆలోచనతో నిన్న ఇంటికి వచ్చేను. రాగానే నువ్వూ, మేస్టారు కనిపించేరు. దానిమీద నీ మనస్తత్వం, తద్వారా స్త్రీ తత్వం తెలుసుకో వచ్చునని ఈ రోజు కాలేజీ కూడా ఎగ్గొట్టేసేను..." అంది నవ్వుతూ. కళ్ళనిండా నిండిన నీళ్ళతో కమల కూడా నవ్వింది.

"నన్ను క్షమించు కమలా...నిన్ను బాధ పెట్టేనూ ... వెళ్ళొస్తానూ... మధ్యాహ్నం కాలేజీకి వెళ్ళిపోతాన్లే ఈ విషయంమీద గట్టిగా వాదించొద్దూమరి..." అంటూ వెళ్లి పోయింది వసంత. *